
ప్రజాశక్తి
మంగళవారం 30 జనవరి 2024
పార్వతీపురం మన్యం



నేడు పోలమాంబ మారు జాతర

ప్రజాశక్తి - మక్కువ

శంబర పోలమాంబ అమ్మవారి మారుజాతర మంగళవారం జరగనుంది. ఈ జాతరకు సంబంధించి దేవాదాయ శాఖ ఇఇ వివిఎస్ నారాయణ ఆధ్వర్యంలో ముమ్మరంగా ఏర్పాట్లు చేశారు. వనంగుడి వద్ద అమ్మవారిని భక్తులు దర్శించుకోనున్నారు. ఈ సందర్భంగా క్యూలైన్లను పటిష్టంగా ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. అమ్మవారి వేప చెట్టు దగ్గర మొక్కులు తీర్చుకునే భక్తుల కోసం పసుపు, కుంకుమ దీపాలు పూజా సామాగ్రిని అందుబాటులో ఉంచామని ఇఇ తెలిపారు. గతవారం కంటే భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున సిఐ ధనుంజయ్‌రావు ఆధ్వర్యంలో స్థానిక ఎస్ఐ నరసింహమూర్తి పర్యవేక్షణలో 150 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. అలాగే సాలూరు, పార్వతీపురం, విజయనగరం డిపోల నుండి బస్సులను భక్తుల సౌకర్యార్థం తిప్పనున్నారు.



ఇరు పార్టీల్లోనూ కదనోత్సాహం



- అయినా అభ్యర్థుల మార్పులు, చేర్పులపై అనుమానం
- భారీగా కప్పగెంతులు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

మరో 70రోజుల్లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి. ఈ సందర్భంగా ప్రధాన పార్టీలైన వైసిపి, టిడిపి అభ్యర్థులుగా దాదాపు ఖరారైన అలజంగి జోగారావు, బోనెల విజయచంద్ర పూర్తి స్థాయిలో తమ తమ శ్రేణులను బలోపేతం చేసుకొని ఎన్నికల రణరంగానికి కదనోత్సవంతో ఉరకలు వేస్తున్నారు. ఇప్పటికే తెలుగుదేశం పార్టీ మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులను కాదని ఈసారి ఎన్నికలకు బోనెల విజయచంద్రతో వెళ్లేందుకు ఆయనకు నాలుగు నెలల క్రితం ఆ పార్టీ అధినేత చంద్రబాబు నియోజకవర్గ ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. అలాగే పార్వతీపురం ఎమ్మెల్యేగా ఎన్నికైన అలజంగి జోగారావు అటు ప్రభుత్వ పథకాల అమల్లోనూ, పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు గడప గడప వంటి కార్యక్రమాలు పెద్ద ఎత్తున విజయవంతం చేసి అటు అధిష్టానం, ఇటు నియోజకవర్గ ప్రజలు పార్టీ కార్యకర్తలు నాయకుల దృష్టిలో మంచి మార్కులు సంపాదించుకున్నారు. ఇటీవల నియోజకవర్గంలో చేరికలు రాజకీయానికి ఇరుపార్టీల నేతలు తెర లేపారు.

భారీగా కప్పగెంతులు

అధికార వైసిపి నుంచి ప్రతిపక్షం టిడిపిలోకి, ప్రతిపక్ష పార్టీ నుంచి అధికారపక్షం లోనికి వీలైనంత మందిని చేర్చుకుని ఒకర్ని మించి ఒకరు పోటీపడుతున్నారు. ఈ పరిస్థితి పార్వతీపురంలో మొదలై, సీతానగరం, బలిజిపేట మండలాలకు పాకింది. దీనివల్ల రాజకీయం మరింత రసవత్తరంగా మారింది. ఇదిలా ఉండగా, ఇరు పార్టీల్లోని ఆశావహులు మాత్రం అభ్యర్థుల మార్పు కచ్చితంగా ఉంటుందన్న చర్చ జరుగుతోంది. అధికార పార్టీ నుంచి స్థానిక ఎమ్మెల్యే అలజంగికి బదులు ఈసారి టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్‌కు అవకాశం కల్పిస్తారనే ప్రచారం ముమ్మరం చేస్తున్నారు. బలమైన అలజంగికి బదులుగా వేరొకరిని తీసుకువచ్చే ప్రసక్తే లేదని ఎమ్మెల్యే అనుకూల వర్గం వాదిస్తోంది. వైసిపి అధినాయకుడు జగన్మోహన్‌రెడ్డి ఇటీవల రాష్ట్రంలో ఎస్సీ నియోజకవర్గాల్లో అభ్యర్థులను మార్పు చేస్తున్న విషయం ఈ వాదనకు బలం చేకూరుస్తుంది. అలాగే పార్వతీపురం నియోజకవర్గం టిడిపి ఇన్చార్జినే మార్చారని అసెంబ్లీ అభ్యర్థిగా పాత చిరంజీవులకు గానీ, లేదా అదే సామాజిక వర్గంలో పెద్ద స్థాయిలో ప్రభుత్వ ఉద్యోగి భార్యకు అవకాశం కల్పిస్తారని బోనెల విజయ్‌చంద్ర వ్యతిరేక గ్రూపు ప్రచారం చేస్తుంది. ఈ పార్టీలో ఒక సామాజిక వర్గంలో పట్టు ఉన్న టిడిపి సీనియర్ నాయకుడు విజయచంద్రకు సహకరించడంలేదని, కావున టిడిపి అభ్యర్థి మార్పుకు టిడిపి పోలిట్ బ్యూరో స్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. అయితే ఈ ప్రచారాలను ఏమాత్రం పట్టించుకోకుండా అటు అలజంగి జోగారావు గానీ, ఇటు బోనెల విజయచంద్ర గానీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పగలు, రాత్రి అనకుండా నియోజకవర్గంలోని అన్ని గ్రామాలను సందర్శిస్తూ, ఆయా పార్టీ అనుకూలురను కలుపుకొని రెట్టించిన ఉత్సాహంతో పనిచేస్తున్నారు. సాధారణ ఎన్నికలకు సమయం సమీపిస్తున్న తరుణంలో రెండు పార్టీల అధినాయకులు తమ తమ అభ్యర్థులను అధికారంగా ప్రకటించి పార్వతీపురం నియోజకవర్గంలో నెలకొన్న ఈ సందిగ్ధ పరిస్థితులకు తెరదించాలని టిడిపి, వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కోరుతున్నారు.

జెకెసికి పోటెత్తిన ఫిర్యాదులు

ప్రజాశక్తి - పార్వతీపురం

స్థానిక కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహిచిన జగనన్నకు చెబుదాం కార్యక్రమం ఫిర్యాదారుదారులతో పోటెత్తింది. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 192మంది ఫిర్యాదు దారులు తమ సమస్యలపై వినతులను కలెక్టర్ నిశాంత్‌కుమార్‌కు అందజేశారు. వినతులను ఆయతో పాటు ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి.విష్ణుచరణ్, జిల్లా రెవిన్యూ అధికారి జె. వెంకటరావు, కె.కె.ఆర్.సి. ఎస్.డి.సి. జి.కేశవనాయుడు, ఆర్.డి.ఒ. కె.హేమలత ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో అందజేసిన వినతులకు సకాలంలో పరిష్కారం చూపాలని, ప్రజా సమస్యలను గ్రామ స్థాయిలోనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు తెలియజేసిన సమస్యలపై సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించారు. కార్యక్రమంలో అన్నిశాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



లబ్ధిదారునికి పట్టా అందజేస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

కొత్తవలస నిర్వాసితులకు పట్టాలు పంపిణీ

రైల్వే మూడో లైన్ నిర్మాణంలో భాగంగా కొత్తవలసలో నిర్వాసితులైన 14 కుటుంబాలకు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పట్టాలు పంపిణీ చేశారు. వెంకంపేట అర్బన్ లే అవుట్‌లో నిర్వాసిత 14 కుటుంబాలకు పట్టాలు జారీ చేశారు.కార్యక్రమంలో ఐటిడిఎ పిఒ సి.విష్ణు చరణ్, డిఆర్ఒ జె.వెంకటరావు, ఆర్‌డిఒ కె.హేమలత, కెఆర్‌ఆర్‌సి ఎస్‌డిసి జి కేశవనాయుడు, తహశీల్దార్ శివన్నారాయణ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ఐటిడిఎ వద్ద ఆందోళన చేస్తున్న ఉపాధ్యాయులు, వాలంటీర్లు, విద్యార్థులు

గిరిజన విద్యారంగ సమస్యలపై ధర్నా

ప్రజాశక్తి - సీతంపేట

గిరిజన విద్యారంగంలోని ఉపాధ్యాయుల, భాషావాలంటీర్ల సమస్యల పరిష్కారం కోరుతూ సోమవారం స్థానిక ఐటిడిఎ వద్ద యుటిఎఫ్, ఎపి ఆదివాసీ గిరిజనసంఘం, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన సోమవారం ధర్నా జరిగింది. ధర్నానుద్దేశించి నాయకులు మాట్లాడుతూ గిరిజన విద్యారంగం అనేక సమస్యలను ఎదుర్కొంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల గిరిజన విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. సమస్యలను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కావడంలేదన్నారు. పిజి హెచ్‌ఎంలు, ఎస్ఎ క్యాడర్ ఉద్యోగోన్నతులు వెంటనే కల్పించాలని, జిఒ 3ను పునరుద్ధరించాలని, నాన్‌షెడ్యూల్ ఏరియా గ్రామాలను షెడ్యూల్డ్ ఏరియాల చేర్చాలని, సవరభాషా వాలంటీర్లను జూన్ నుంచి నియమించి మార్చి, ఏప్రిల్ వరకూ కొనసాగించాలని కోరారు. భాషా వాలంటీర్లకు కనీసవేతనమివ్వాలని, ఇన్‌సర్వీసు ట్రెనింగ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. జాతాపు, గదబ భాషావాలంటీర్లను నియమించాలనికోరారు. జిఒ 117ను గిరిజన సంక్షేమ పాఠశాలలకు వర్తించరాదన్నారు. ప్రతి జిపిఎస్ పాఠశాలల్లో ఇద్దరు ఎస్‌జిటిలు ఉండేలా చర్యలు తీసుకోవాలని, అటవీ ఉత్పత్తులకు మద్దతు ప్రకటించాలని డిమాండ్ చేశారు. వీటితో పాటు మరిన్ని సమస్యలపై ఐటిడిఎ పిఒకు వినతిని అందజేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు టి.రమేష్, ఎస్.మురళీమోహన్, ఎపి ఆదివాసీ గిరిజనసంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.లక్ష్మణరావు, ఎ.అవినాష్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె.రాజు, డి.పండు, మాతృభాషా వాలంటీర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎస్.డంబురు, నాయకులు ఆనందరావు, పలువురు ఉపాధ్యాయులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

ఒప్పంద జిఒలను విడుదల చేయాలి

మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యాన ధర్నా

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్


మున్సిపల్ కార్మికుల సమ్మెలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఒప్పుకున్న జీవోలను వెంటనే విడుదల చేయాలని స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆర్ఒ రూబేనుకు సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, కార్మిక సంఘాల నాయకులు చీపురుపల్లి సింహాచలం, మామిడి శివతో కలిసి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కారం కావాలని రాష్ట్రవ్యాప్తంగా సమ్మె జరిగిందని, ఈ సమ్మెలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం కార్మిక సంఘాలతో మాట్లాడి చర్చలు జరిపిందని, కార్మికుల సమస్యలు పరిష్కారం చేస్తామని, కొన్ని జీవోలు విడుదల చేస్తామని ప్రభుత్వం హామీ ఇవ్వడంతో సమ్మె విరమించినట్టు తెలిపారు. సమ్మె విరమణ జరిగి 15 రోజులవుతున్నా నేటికీ జీవోలు అమలు చేయలేదన్నారు. కార్మికులందరికీ రూ.21వేలు వేతనం చెల్లించాలని, డ్రైవర్లందరికీ రూ.24,500 చెల్లించాలని, పర్మినెంట్ కార్మికులకు సరెండర్ లీవుల బకాయిలు చెల్లించాలని, స్కూల్ స్వీపర్లందరికీ 23శాతం వేతనం పెంచాలని, ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, క్లాప్ ఆటో డ్రైవర్లకు కనీస వేతనం ఇవ్వాలని, ప్రభుత్వ జిఒలన్నీ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

సాలూరు: మున్సిపల్ కార్మికుల సమ్మె నేపథ్యంలో ప్రభుత్వంతో జరిగిన చర్చల్లో ఇచ్చిన హామీల మేరకు ప్రభుత్వం వెంటనే జీవోలు జారీ చేయాలని డిమాండ్ చేస్తూ కార్మికులు ధర్నా నిర్వహించారు. మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఎన్వైనాయుడు ఆధ్వర్యాన కార్మికులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 16 రోజుల సమ్మెను వేతనంతో కూడిన సెలవుగా పరిగణిస్తూ జీవో ఇంతవరకు జారీ చేయలేదని చెప్పారు. ప్రభుత్వంతో చర్చల సమయంలో కుదిరిన ఒప్పందం మేరకు జీవోలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు టి.రాముడు, టి.శంకరరావు, పోలరాజు, స్వప్న, రవి పాల్గొన్నారు.

పాలకొండ : మున్సిపల్ కార్మికుల సమ్మె పోరాట ఒప్పందాలు, జీవోలు, వెంటనే విడుదల చేయాలని, డిమాండ్ చేస్తూ ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో స్థానిక నగరపంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ పాలకొండ కమిటీ గౌరవాధ్యక్షులు దావాల రమణారావు మాట్లాడారు. కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు పడాల. భాస్కరరావు, చింతల. సంజీవి, సురేష రఘు, శ్రీదేవి, విమల ,తదితరులు నాయకత్వం వహించారు సిఐటియు పాలకొండ మండల కమిటీ కార్యదర్శి కాదా రాము వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ నాయకులు దూసి దుర్గారావు తదితరులు.కార్మికులందరూ పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



సాలూరు : మున్సిపల్ మేనేజర్‌కు వినతిని అందజేస్తున్న కార్మికులు, ఉద్యోగులు



పార్వతీపురం : మున్సిపల్ ఆర్‌ఒకు వినతిని అందజేస్తున్న కార్మికులు, ఉద్యోగులు

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్



మాట్లాడుతున్న డిఆర్ఒ వెంకటరావు

మార్చిలో జరగనున్న ఇంటర్ పబ్లిక్ పరీక్షలు నిర్వహణకు కావాల్సిన ఏర్పాట్లు పూర్తిచేయాలని జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు తెలిపారు. పరీక్షల నిర్వహణకు ముందస్తు ఏర్పాట్లలో భాగంగా సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి పరీక్షల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పరీక్షల నిర్వహణలో భాగమైన వివిధ శాఖల ముందస్తు ఏర్పాట్లపై డిఆర్ఒ సమీక్షించారు. పరీక్షల నిర్వహణలో ఆయా శాఖలకు కేటాయించిన పనుల ఏర్పాట్లు పూర్తిచేయాలని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థుల సౌకర్యార్థం బస్సులు నడపాలని ప్రజా రవాణాశాఖ అధికారులకు ఆదేశాలు జారీచేశారు. రైల్వే గేట్లు గల గ్రామాల నుంచి వి ద్యార్థులు ముందుగా బయలుదేరేలా చూడాలని తెలిపారు. పరీక్షలు జరుగురోజులలో ఉదయం 8 గంటలనుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలన్నారు. పరీక్షా కేంద్రాల్లో మంచినీరు ఏర్పాటుచేయాలని తెలిపారు. వైద్య, ఆరోగ్య శాఖ పరీక్షా కేంద్రాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షను అమలు చేయాలని, ఎస్కార్ట్, పోలీసు బందోబస్తు ఏర్పాటుచేయాలని పోలీసు అధికారులకు తెలిపారు. పరీక్షల నిర్వహణ తనిఖీ చేసేందుకు సిట్టింగు, ఫ్లయింగు స్క్వాడ్ లను ఏర్పాటు చేయాలని తెలిపారు. పరీక్షల నిర్వహణ అనంతరం జవాబు పత్రాల బండిల్స్ సకాలంలో పంపించేందుకు, పరీక్షల నిర్వహణ అధికారులకు పోస్టలు సిబ్బంది సహకరించాలని తెలిపారు.

జిల్లా ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ అధికారి డి.మంజులవీణ పరీక్షల ఏర్పాట్ల గూర్చి తెలియజేస్తూ జిల్లా కేంద్రంలో స్ట్రాంగు రూం, జిల్లాలో 32 పరీక్షా కేంద్రాలు, 14 స్టోరేజి పాయింట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఫిబ్రవరి 5 నుంచి 20వరకు ప్రాక్టికల్ పరీక్షలు, మార్చి 1నుంచి 20వరకు రాతపరీక్షలు నిర్వహించనున్నటు తెలిపారు. మొత్తం 17268 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారని తెలిపారు. సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి బి.సత్యనారాయణ, పోలీసు సర్కిల్ ఇనస్పెక్టరు పి.వి.వి.ఎస్.ఎన్. కృష్ణమూర్తి, కలెక్టరేట్ డి సెక్షను సూపరింటెండెంటు ఎం.రమణమ్మ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



డిఆర్‌ఒకు వినతిని అందజేస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

గిరిజనులకు పోడు పట్టాలివ్వాలి : సిపిఎం

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

సర్వే చేసిన గిరిజనులకు పోడు పట్టాలివ్వాలని, పట్టాలివ్వకుండా తిప్పుతున్న రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు డిమాండ్ చేశారు. గిరిజన సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులతో కలిసి డిఆర్ఒ జె.వెంకటరావుకు సోమవారం వినతి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాలూరు మండలం నార్లవలస పంచాయతీ బొర్రపనుకువలస గ్రామ గిరిజనులకు అటవీ భూమి పట్టాలివ్వకుండా రెవెన్యూ అధికారులు తిప్పుతున్నారన్నారు. ఆ గ్రామంతో పాటు సర్వే చేసిన పక్క గ్రామాలకు ఇచ్చి ఆ గ్రామానికి ఇవ్వకుండా నిర్లక్ష్యం వహిస్తున్నట్లు చెప్పారు. దీనిపై అడిగితే మీ దిక్కున్న దగ్గర చెప్పకండి అని అంటున్నారని తెలిపారు. దీనికి ఐటిడిఎ పీవో స్పందిస్తూ వెంటనే దర్యాప్తు చేసి పట్టాలు ఇప్పిస్తామని స్థానిక అధికారులకు ఫోన్లో మాట్లాడారు. 2,3 రోజుల్లో ఇస్తామని చెప్పారు. పట్టాలివ్వకపోతే వారం రోజుల్లో సాలూరు తహశీల్దార్, కలెక్టర్ ఆఫీస్ వద్ద ఆందోళన పోరాటం చేపడతామని వేణు చెప్పారు.

దాడులు తప్ప బిసిలకు ఒరిగేదేమీ లేదు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

రాష్ట్రంలో బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీలపై దాడులు తప్ప జరిగేది ఏమీ లేదని పాలకొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ అన్నారు. స్థానిక జామి వారి కాంప్లెక్స్‌లో సోమవారం జయహో బిసి కార్యక్రమం నిర్వహించారు. తొలుత నాయకులు మాట్లాడుతూ బిసి కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఆ కార్పొరేషన్‌కు నిధులు లేకుండా చేసిన ఘనత సిఎం జగన్మోహన్‌రెడ్డిదే అన్నారు. అన్ని కార్పొరేషన్లకు చైర్మన్లు తప్ప నిధుల్లేవని కార్పొరేషన్ నిధులను దారి మళ్లించుతున్నట్టు వారు ఆరోపించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నేని అప్పలనాయుడు, అరకు పార్లమెంట్ బీసీ సెల్ కన్వీనర్ పి కృష్ణమూర్తినాయుడు, అరకు పార్లమెంటరీ బిసి సెల్ కార్యదర్శి పి నాగేశ్వరరావు, మండల అధ్యక్షులు ఉదయాన ఉదయభాస్కర్, ప్రధాన కార్యదర్శి సిహెచ్ ఉమామహేశ్వరరావు, పట్టణ అధ్యక్షులు జామి లక్ష్మీనారాయణ, బల్ల హరిబాబు, పెద్ద ఎత్తున బీసీ నాయకులు పాల్గొన్నారు.

31న విజయనగరంలో ప్రాంతీయ జాబ్‌మేళా

ప్రజాశక్తి - పార్వతీపురం

విజయనగరంలో ప్రాంతీయ జాబ్ మేళా ఈనెల 31న జరుగుతుందని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర స్థాయిలో విజయనగరంలోని సీతం ఇంజనీరింగ్ కళాశాలలో రీజినల్ మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ మేరకు జాబ్ మేళా పోస్టర్‌ను సోమవారం విడుదల చేశారు. రీజినల్ జాబ్ మేళాకు 87 బహుళ జాతి కంపెనీల్లో 5,842 ఖాళీలను భర్తీ చేస్తారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని జిల్లా నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. టెన్త్, ఇంటర్, ఐటిఐ, డిప్లొమా, డిగ్రీ, పీజీ, బి.టెక్, ఎంబీఏ చదివిన నిరుద్యోగ యువతీ, యువకులు అర్హులన్నారు. యువత తమ వివరాలు skilluniverse.apssdc.in వెబ్ సైట్ నమోదు చేసుకొని, ఆధార్ కార్డు, విద్యార్హత సరిఫికేట్స్, పాస్పోర్ట్ సైజు ఫొటోస్‌తో ఉదయం 9 గంటలకు రీజినల్ జాబ్ మేళా జరుగు ప్రదేశంలో హాజరు కావాలని ఆయన సూచించారు. మరిన్ని వివరాలకు 630511094, 6301275511 నంబర్లకు సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఐటిడిఎ పిఒ సి.విష్ణుచరణ్, డిఆర్ఒ జె.వెంకటరావు, ఆర్‌డిఒ కె.హేమలత, జిల్లా పరిశ్రమల అధికారి ఎంవి కరుణాకర్, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి యు.సాయి కుమార్, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టర్ చొరవ అభినందనీయం

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ చొరవ అభినందనీయమని వీరఘట్టంకు చెందిన విశ్రాంత వైద్య అధికారి డాక్టర్ కొప్పర అమృతం అన్నారు. 1975లో వీరఘట్టంలో 75 సెంట్ల భూమిని ప్రభుత్వం నుండి కొనుగోలు చేశామని, 2002లో ఉద్యోగ విరమణ అనంతరం ఇళ్లు, క్లినిక్ నిర్మాణం చేయాలని ప్రయత్నించినట్టు తెలిపారు. నిర్మాణం చేసేందుకు సిద్ధపడగా, ఈ భూమి 22(ఎ)లో ఉందని రెవిన్యూ అధికారులు అన్నారని చెప్పారు. 22(ఎ) జాబితా నుండి తొలగించేందుకు పలు ప్రయత్నాలు చేశానని, పూర్వ శ్రీకాకుళం జిల్లా పరిధిలో ఉండడంతో 2019 నుండి శ్రీకాకుళం కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిరిగానని తెలిపారు. ఆఖరుకు పార్వతీపురం మన్యం జిల్లా పరిధిలోకి వస్తుందని చెప్పి రికార్డు బదిలీ చేశారని ఆయన వివరించారు. దీంతో ఇక్కడి కలెక్టర్‌ను కలిసి వివరాలు తెలియజేయగా తక్షణం స్పందించి పరిష్కరించారని ఆయన అభినందించారు. జిల్లా కలెక్టర్ చేసిన సహాయం మరువలేనిన్నారు. జిల్లా కలెక్టర్ పెద్ద మనసుతో చేసిన ఈ సహకారం 79 ఏళ్లవయస్సు కలిగిన తనకు ఎంతో ఉపశమనం ఇచ్చిందన్నారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు అందజేశారు. కార్యక్రమంలో ఐటిడిఎ పిఒ సి.విష్ణు చరణ్, డిఆర్ఒ జె.వెంకటరావు, ఆర్‌డిఒ కె.హేమలత, కెఆర్‌ఆర్‌సి ఎస్‌డిసి జి కేశవనాయుడు, తహశీల్దార్ శివన్నారాయణ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బాబు మోసగాడు.. పవన్ వేషగాడు

ఆసరా పంపిణీలో డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి - సాలూరు

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు పచ్చి మోసగాడని, ఆయన పార్ట్‌నర్ జనసేన అధినేత పవన్ కల్యాణ్ వేషగాడని డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో మున్సిపాలిటీ, మండలం పరిధిలోని డ్వాక్రా మహిళలకు ఆసరా పథకం కింద చెక్కులు పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 2014లో డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చేస్తానని చెప్పి నిలువునా మోసగించారన్నారు. ఆయన మాటలు నమ్మి మహిళలు టిడిపికి ఓటేస్తే అధికారంలోకి వచ్చిన తర్వాత టోపీ పెట్టారని అన్నారు. అలాగే రైతులకు రుణమాఫీ చేస్తామని చెప్పి మోసం చేసిన ఘనత బాబుదేనన్నారు. ఇప్పుడు జనసేన నాయకులతో కలిసి టిడిపి నాయకులు మళ్లీ మోసపూరిత వాగ్దానాలతో ప్రజల ముందుకు వస్తున్నారని చెప్పారు. వైసిపి ప్రభుత్వ హయాంలో రూపాయి ఖర్చు లేకుండా పేదలకు నేరుగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నట్టు తెలిపారు. ఇలాంటి ప్రభుత్వాన్ని వద్దనుకుంటే నష్టపోయేది పేదలేనని అన్నారు. నియోజకవర్గంలో తన హయాంలో ఎక్కడెక్కడ ఏం అభివృద్ధి పనులు జరిగాయో చెప్పడానికి సిద్ధంగా వున్నానని అన్నారు. ఇప్పటికే అనేక సార్లు అభివృద్ధిపై చర్చకు రావాలని కోరినా టిడిపి నాయకులు ముందుకు రాలేదని చెప్పారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా పని చేసిన భంజ్ దేవ్, ఒకసారి ఎమ్మెల్సీగా చేసిన సంధ్యారాణి నియోజకవర్గంలో ఏ అభివృద్ధి చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఓట్లు అడగడానికి వచ్చినప్పుడు మహిళలు టిడిపి నాయకులను ప్రశ్నించాలని రాజన్నదొర కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ, వైస్ చైర్మన్లు జర్జాపు దీప్తి, వంగపండు అప్పలనాయుడు, అర్బన్ బ్యాంక్ అధ్యక్షులు జర్జాపు ఈశ్వరరావు, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి జర్జాపు సూరిబాబు, జెసిఎస్ కన్వీనర్ గిరిరఘు, కౌన్సిలర్లు రాపాక మాధవరావు, పప్పల లక్ష్మణరావు, ఎంపిపి రాములమ్మ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ రెడ్డి పద్మావతి, సీనియర్ నాయకులు దండి శ్రీనివాసరావు, వైస్ ఎంపిపిలు రెడ్డి సురేష్, సువ్వాడ గుణవతి, మండల వైసిపి అధ్యక్షులు సువ్వాడ భరత్ శ్రీనివాసరావు, మండల జెసిఎస్ కన్వీనర్ కె.త్రినాధనాయుడు, కమిషనర్ టి.జయరాం, ఎంపిడిఒ జి.పార్వతి పాల్గొన్నారు.



సాలూరు : మహిళా సంఘ సభ్యులకు ఆసరా చెక్కును అందజేస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

కొమరాడ : మండల కేంద్రంలో జరిగిన వైయస్సార్ నాలుగో విడత ఆసరా చెక్కును మహిళా సంఘ సభ్యులకు కురుపాం ఎమ్మెల్యే పి.పుష్పశ్రీవాణి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ఈ పథకం అమలు చేస్తుందన్నారు. కావున ఈనిధులను మహిళలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ కిరణ్‌కుమార్, ఎంపిడిఒ ఎం.మల్లిఖార్జునరావు, ఎపిఎం వెంకటరమణ, ఎపిడి, డిపిఎంలు, జెడ్‌పిటిసి సభ్యులు ద్వారపురెడ్డి లక్ష్మి, ఎంపిపి శెట్టి శ్యామల, వైస్ ఎంపిపిలు నంగిరెడ్డి శరత్‌బాబు, హిమరక అన్నపూర్ణ, స్థానిక ఎంపిటిసి సభ్యులు ఎం.అశ్విని, వైసిపి కన్వీనర్ జనార్దన, పిఎసిఎస్ అధ్యక్షులు ఎం. సురపనాయుడు, గోపాలకృష్ణ , పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలు, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

పార్వతీపురం టౌన్ : అక్కాచెల్లమ్మల ఆర్థిక స్వావలంబన సాధించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి మహిళా పొదుపు సంఘాల రుణ మాఫీ చేసి అండగా నిలిచారని స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. స్థానిక జూనియర్ కాలేజ్ గ్రౌండ్‌లో నిర్వహించిన వైయస్ఆర్ ఆసరా 4వ విడత సంబరాలు కార్యక్రమంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు పాల్గొని మాట్లాడారు. ఎన్నికల హామీలలో ఇచ్చిన మాట ప్రకారం డ్వాక్రా మహిళా సంఘాల సభ్యులకు రుణమాఫీ చేసి వారి రుణం తీర్చుకున్నారని అతని రుణం తీర్చుకోవాలంటే ప్రతి ఒక్కరూ వైసిపికి ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బి గౌరేశ్వరి, వైస్ చైర్ పర్సన్ కొండపల్లి రుక్మిణి, పార్టీ పట్టణ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, మెప్మా పీడీ, మున్సిపల్ కమీసనర్, వివిధ వార్డుల కౌన్సిలర్ సభ్యులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, మెప్మా సిబ్బంది, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

పెదశాఖకు తాగునీరు సరఫరా చేయాలి

ప్రజాశక్తి -కొమరాడ

మండలంలోని పెదశాఖకు మంచినీరు ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.ఇందిర డిమాండ్ చేశారు. సోమవారం పెదశాఖ గ్రామ సచివాలయం వద్ద నిరసన కార్యక్రమం చేసిన అనంతరం వాలంటీర సరేంద్రకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు ఇందిర, కొల్లి సాంబమూర్తి మాట్లాడుతూ పెదశాఖలో ఉన్న మంచినీరు ట్యాంకు బాగా శిథిలమైపోవడంతో కలుషిత నీరు సరఫరా వస్తుందన్నారు. కొళాయిల ద్వారా వచ్చిన నీరు కూడా అక్కడక్కడ పైపులు పగిలిపోవడంతో నీరు వృథాగా పోతుందన్నారు. కావున వెంటనే మంచినీటి ట్యాంక్‌ను శుభ్రం చేసి, రక్షిత మంచినీరందించాలని కోరారు. లేనిచో కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు చింతమణి, గంగరాజు గ్రామస్తులు పాల్గొన్నారు.

ధ్రువపత్రాలు తప్పనిసరి

ప్రజాశక్తి - కురుపాం

ద్విచక్ర వాహనం నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహనదారులకు మద్యం సేవించకుండా తప్పనిసరిగా అన్ని ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలని స్థానిక ఎస్ఐ షణ్ముఖరావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో గల కొట్టు సమీపంలో వాహనాలు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్క వాహనాన్ని తనిఖీలు నిర్వహించి ధ్రువీకరణ పత్రాల్ని పరిశీలించి సరైన ధ్రువీకరణ పత్రాలు లేని వాహనదారులకు అపరాధ రుసుం విధించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వైరిచర్ల వీరచంద్ర దేవ్

టిడిపితోనే గిరిజనాభివృద్ధి : వైరిచర్ల

ప్రజాశక్తి - కురుపాం

ఏజెన్సీ గ్రామాల్లో మౌళిక వసతులు, గిరిజన ప్రజలు అభివృద్ధి చెందాలంటే తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని టిడిపి రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరచంద్ర దేవ్ అన్నారు. మండలంలోని నీలకంఠాపురం, ఉసకొండ గిరిజన గ్రామాల్లో ఆయన తండ్రి, మాజీ ఎంపి ప్రదీప్ చంద్రదేవ్‌తో కలిసి సోమవారం పర్యటించి ఆ గ్రామాల్లో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను వారితో చర్చించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన గిరిజనులతో మాట్లాడుతూ గిరిజన గ్రామాల ప్రజలు అభివృద్ధి చెందాలంటే వారికి కావాల్సిన సంక్షేమ పథకాలు చంద్రబాబే ఇస్తారన్నారు. కావున రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కచ్చితంగా టిడిపిని గెలిపించడానికి గిరిజనుమంతా సిద్ధంగా ఉండాలని, అప్పుడే గిరిజన గ్రామాలు అభివృద్ధి చెందడంతో పాటు ప్రజలకు లబ్ధి చేకూరుతుందని అన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ కెవి కొండయ్య , నాయకులు కర్రి శ్రీను, బోటు గౌరి, ఉసకొండ మాజీ సర్పంచ్, స్థానిక గిరిజన యువత మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

స్పందనకు 104 వినతులు

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఐటిడిఎ స్పందనకు 104 వినతులు వచ్చాయి. ఈ స్పందన కార్యక్రమం పిఒ కల్పనాకుమారి నిర్వహించారు. స్పందనకు వచ్చిన వినతుల్లో కొన్ని... పెద్దరాజపురానికి చెందిన సవరం మొఖలింగం అంత్యోదయ కార్డు మంజూరు చేయాలని కోరారు. పెద్ద గూడకు చెందిన కోటేశ్వరరావు కమ్యూనిటీ హాల్, కొడిసికి చెందిన అప్పలస్వామి పవర్ వీడర్, మర్రిగూడకు చెందిన మంగయ్య కోళ్లఫారం షెడ్డు మంజూరు చేయాలని కోరారు. దెబ్బగూడకు చెందిన జాగారం ఇల్లు మంజూరు చేయాలని కోరారు. స్పందన కార్యక్రమంలో ఎపిఒ రోసిరెడ్డి, డిడి అన్నదొర, ఇఇ సింహాచలం, డిప్యూటీ డిఇఒ లిల్లీ రాణి, సిడిపిఒ రంగ లక్ష్మి, డిప్యూటీ డిఎంహెచ్ఒ విజయా పార్వతి పాల్గొన్నారు.

సంపత్ కుమార్ సేవలు మరువలేనివి

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక ఎమ్మార్సీలో గత 15ఏళ్లుగా డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎన్.సంపత్‌కుమార్ అకాల మరణంతో ఆయన సేవలు మరువలేకపోతున్నామని ఎంఇఒలు డి.గౌరినాయుడు, ఆర్.ఆనందరావు అన్నారు. సోమవారం స్థానిక ఎంఆర్‌సి కార్యాలయంలో సంపత్ కుమార్ చిత్రపటానికి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘ నాయకులు ప్రభుత్వం ఆయన కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘ నాయకులతో పాటు ఎంఆర్‌సి సిబ్బంది ఉన్నారు.

రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యత

ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం

ఏజెన్సీలో రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తున్నట్టు ఎమ్మెల్యే పి.పుష్పశ్రీవాణి అన్నారు. మండలంలోని తాడికొండ పంచాయతీ ఎగువ తాడికొండ నుంచి చాపరాయి, జంగిడి భద్రవ రకు 3కిలోమీటర్లు బిటి రహదారి నిర్మాణానికి సోమవారం ఆమె శంకుస్థాపన చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రూ. 2కోట్ల 60 లక్షలతో రోడ్డు పనులు ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఈ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించి అన్ని రకాల మౌళిక వసతులు అందుబాటులో తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

మక్కువ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశం సాదాసీదాగా ముగిసింది. సోమవారం ఎంపిపి మర్రి పారమ్మ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు సభకు నివేదిక తెలియజేశారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు ఎం.శ్రీనివాసరావు, ఎంపిడిఒ సూర్యనారాయణ, డిటి ఇబ్రహీం, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న విశ్రాంత ఉద్యోగులు

విశ్రాంత ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

సమస్యల పరిష్కారం కోరుతూ విశ్రాంత ఉద్యోగులు సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. వీరి ధర్నాకు జెఎసిలో గల అన్ని సంఘాల నాయకులు హాజరై తమ సంఘీభావం తెలిపారు. అనంతరం కలెక్టర్ నిశాంత్‌కుమార్‌కు వినతిని అందజేశారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు మాట్లాడుతూ 11వ పిఆర్‌సిలో 2022 నుంచి తగ్గించిన అడిషనల్ క్వాంటమ్‌ను తిరిగి యధావిధిగా అంతకు ముందు ఇస్తున్న 70ఏళ్లు నిండిన వారికి 10శాతం, 75ఏళ్లు నిండిన వారికి 15శాతానికి పునరుద్ధరించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న డిఆర్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, 10వ పిఆర్‌సి ఎరియర్స్ వెంటనే చెల్లించాలని, హెల్త్ కార్డు ద్వారా అన్ని వ్యాధులకు అన్ని గుర్తింపు పొందిన హాస్పిళ్లలో వైద్యం అందించాలని, మెడికల్ రీయింబర్సుమెంటు పరిధి రూ.2 లక్షల నుండి రూ.5 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రిటైర్డ్‌పెన్షన్ దారుల సంఘం అధ్యక్ష కార్యదర్శులతో పాటు సంఘ సభ్యులు, పలువురు రిటైర్డ్ ప్రభుత్వ పెన్షన్‌రులు పాల్గొన్నారు పాల్గొన్నారు.

70 మందితో పోలీసు బందోబస్తు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని యు.వెంకంపేట పంచాయతీ పరిధిలోని మరియగిరి కొండపైన ఈనెల 30న ఉత్సవం జరగనుంది. ఇందుకు సంబంధించి 70మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు పాలకొండ డిఎస్‌పి జీవీ కృష్ణారావు తెలిపారు. సోమవారం మరియగిరి పుణ్యక్షేత్రాన్ని పరిశీలించిన సందర్భంగా మాట్లాడారు. వివిధ ప్రాంతాల నుండి పెద్దఎత్తున యాత్రికులు హాజరవుతున్నట్లు అంచనా వేస్తున్నట్లు తెలిపారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు అందజేశారు. ఆయన వెంట పాలకొండ సిఐ ఎం.చంద్రమౌళి, స్థానిక ఎస్సై ఎం.గోవింద్, సిబ్బంది ఉన్నారు.

టిడిపి అధికారానికి వస్తే తాగు, సాగునీరు

నియోజకవర్గ ఇన్‌చార్జి విజయచంద్ర

ప్రజాశక్తి - కొమరాడ

రాష్ట్రంలో టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పార్వతీపురం మున్సిపాలిటీకి తాగునీరు, నియోజకవర్గానికి సాగునీరు అందించడమే ప్రధాన ధ్యేయమని పార్వతీపురం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బోనెల విజయచంద్ర అన్నారు. సోమవారం జంఝావతి జలాశయ పథకాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎప్పటి వరకు కాలువల ద్వారా ఏ మేరకు రైతులకు సాగునీరందిస్తున్నారు అన్న వివరాలు నాయకులను, మాజీ ప్రాజెక్టు ఉద్యోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విజయచంద్ర మాట్లాడుతూ టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు దృష్టిలో ప్రధాన సమస్యగా ఈ ప్రాజెక్టు సమస్య ఉందని తెలిపారు. పార్వతీపురం పర్యటనలో ముఖ్యంగా ఈ సమస్య ఆయన దృష్టిలో పెట్టినట్లు తెలిపారు. ముఖ్యంగా ప్రాజెక్టు నుంచి పార్వతీపురం మున్సిపాలిటీ ప్రజలకు 24 గంటలు తాగునీరందించేందుకు నివేదికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. మరోవైపు జంఝావతి ప్రాజెక్టు నుంచి హై లెవెల్ కెనాల్ ద్వారా నియోజకవర్గ చివరి గ్రామం వరకు రైతులకు రెండు పంటలకు సరిపడే సాగునీరందించేందుకు కషి చేస్తామని తెలిపారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు ఐదేళ్లు పూర్తవుతున్న కనీసం ప్రాజెక్టుపై దృష్టి సారించలేదన్నారు. ప్రాజెక్టున్నా పూర్తి స్థాయిలో రైతులకు సాగునీరందించే పరిస్థితి ఏర్పడిందన్నారు. ముఖ్యంగా పార్వతీపురం మున్సిపాలిటీకి తాగునీరు ప్రజలు దాహం కేకలతో అల్లాడిపోతున్నా పట్టించుకోని వైసిపి ప్రభుత్వ పాలనపై మండిపడ్డారు. ఈ ఎన్నికల తర్వాత టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ పనులు పూర్తి చేసేందుకు అవసరమైన నిధులు సమకూర్చేలా చంద్రబాబు నాయుడు ప్రణాళికలు సిద్ధం చేశారని తెలిపారు. కాబట్టి మోసం చేస్తూ తప్పుడు ప్రకటనలు చేస్తున్న వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెబుతారని అన్నారు. మరోవైపు ఐదేళ్లు పూర్తవుతున్నా వైసిపి ఎమ్మెల్యే కనీసం పార్వతీపురం మున్సిపాలిటీకి సక్రమంగా తాగునీరందించడంలో కూడా పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు.


సీతానగరం: భవిష్యత్తుకు గ్యారెంటీ కార్డును అందిస్తున్న బోనెల

ఇప్పలవలసలో 'భవిష్యత్తుకు గ్యారెంటీ'

సీతానగరం: మండలంలోని ఇప్పలవలసలో సోమవారం పార్వతీపురం టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి బోనెల విజయచంద్ర ఆధ్వర్యంలో బాబుష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తుకు భరోసా చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. రాష్ట్రంలో వైసిపి అరాచక, అవినీతి పాలనను తరిమి కొట్టేందుకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టిడిపి జనసేన ప్రభుత్వం అధికారంలోకి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఉడమల సూర్యనారాయణ, టిడిపి మండల అధ్యక్షుడు కొల్లి తిరుపతి, ప్రధాన కార్యదర్శి రౌతు వేణుగోపాల్ నాయుడు, జిల్లా నాయకులు గొట్టపు వెంకటి నాయుడు, పోల సత్యనారాయణ రయణ, మండల నాయకులు రెడ్డి సింహాచలం, యోగి రెడ్డి భాస్కర్ రావు, పి పారినాయుడు, బి శ్రీనివాసరావు, పి. చిరంజీవులు, మరిచెర్ల సంజీవ్, జనసేన నాయకులు శ్రీనివాసరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.


పార్కును పరిశీలిస్తున్న పిఒ విష్ణుచరణ్

పార్కు సిద్ధం చేయాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని ఎసికె పాడు పార్కును సిద్ధం చేయాలని ఐటిడిఎ పిఒ సి.విష్ణుచరణ్ ఆదేశించారు. మండలంలోని ఎసికె పాడులో ఏర్పాటు చేస్తున్న కల్చర్ అండ్ అడ్వెంచర్ పార్కు సుందరీకరణ పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ పనులు చేపట్టడంలో జాప్యం చేయరాదని స్పష్టం చేశారు. పనులు వెంటనే పూర్తి చేసి సిద్ధం చేయాలని సూచించారు. పర్యాటకులకు మరపురాని అనుభూతి కలుగుతుందని ఆయన చెప్పారు. అనంతరం కురుపాంలో జిసిసి బంక్‌ను తనిఖీ చేశారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఇంజినీరింగ్ అధికారి జె.శాంతీశ్వరరావు, ఎపిఒ ఎ.మురళీధర్, తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి : సిఐడి డిఎస్‌పి

ప్రజాశక్తి - కొమరాడ

గిరిజనులకు చట్టాలపై అవగాహన ఉండాలని సిఐడి డిఎస్‌పి డి.లక్ష్మణరావు అన్నారు. సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఏర్పాటు చేసిన గిరిజన హక్కులు, సాధికారితపై జరిగిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 35 తెగలు, ఆదివాసీలు 6 శాతం ఉన్నారన్నారు. కొంత మంది గిరిజనులు అవగాహనా లోపం వల్ల ఎవరితోనూ కలవలేరని, అలాంటి బెరుకు, భయం పోవాలని తెలిపారు. గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వాలు అనేక పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. వారి అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. గిరిజనులకు వ్యవసాయం, వ్యాపారం కోసం రుణాలను మంజూరు చేస్తాయని, వాటిని వినియోగించుకుని అభివృద్ధి చెందడానికి దోహదపడతాయని తెలిపారు. వారిలో ఉన్న నైపుణ్యాన్ని వెలుగులోకి తీసుకురావడానికి, చట్టాలపై అవగాహనా కల్పించడానికే ఈ సదస్సులు ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు. తహశీల్దార్ భుజంగరావు మాట్లాడుతూ గిరిజనుల కోసం భారత ప్రభుత్వం ప్రత్యేక చట్టాలను రూపొందించిందని తెలిపారు. అంటరానితనాన్ని నిర్మూలించడాన్ని ఆర్టికల్ 17లో పొందుపర్చారని, 1955లో గిరిజనుల ఉన్నతికి పౌరహక్కుల చట్టం ఏర్పాటు చేశారన్నారు. 1989లో ఎస్‌టి చట్టం వచ్చిందని, వాటిపై గిరిజనులు అవగాహన పొందాలని తెలిపారు. ఎంపిడిఒ మల్లికార్జున మాట్లాడుతూ గిరిజనుల్లో మంచి నైపుణ్యాలున్నాయని, కానీ వాటిని ఎలా సద్వినియోగం చేసుకోవాలో తెలియక వెనకబడిపోయారని తెలిపారు. వీరికి ఉచిత విద్య, వసతి, ఉపాధి వంటి ఎన్నో పథకాలను ప్రభుత్వాలు తీర్చిద్దిద్దారని పేర్కొన్నారు. గిరిజన సంక్షేమ అధికారి సురేష్ మాట్లాడుతూ ప్రభుత్వం కల్పించిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పూడిశ సర్పంచ్ సోడి ఆనందరావు మాట్లాడుతూ చట్టాలపై అవగాహనా లేకపోవడం వల్ల గిరిజనులు వెనకబడిపోయారన్నారు. ఇలాంటి సమావేశాల వల్ల గిరిజనులకు అవగాహనా కలుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాఠశాలల, కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిఎస్‌పి లక్ష్మణరావు

వైద్యపరీక్షలు తప్పనిసరి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

జ్వరాలతో బాధపడే రోగులకు వైద్యపరీక్షలు తప్పనిసరిగా చేయాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు వైద్య సిబ్బందికి సూచించారు. మండలంలోని డోకిశీల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగుల ఆరోగ్య తనిఖీల రికార్డులను పరిశీలించి నమోదు చేసిన అనారోగ్య సమస్యలు, అందజేసిన చికిత్సా వివరాలపై సిబ్బందిని ఆరా తీశారు. జ్వరంతో ఆసుపత్రికి ఎవరు వచ్చినా జ్వర లక్షణాలను స్పష్టంగా తెలుసుకోవాలన్నారు. తప్పనిసరిగా నిర్ధారణ పరీక్షలు చేసి ఫలితాలు నమోదు చేసి తగు చికిత్స అందజేయాలని ఆదేశించారు. పిహెచ్‌సి పరిధిలో మారుమూల గిరిజన గ్రామాలు ఎక్కువగా ఉన్నందున ఏ సమయం లోనైనా వైద్య సేవలు అందజేసేందుకు సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ల్యాబ్ పరీక్షల రికార్డులు తనిఖీ చేసి నమోదు చేసిన రక్త నమూనాల వివరాలు పరిశీలించారు. మైక్రోస్కోప్ పనితీరు గమనించారు. జ్వరాలు గుర్తించిన వెంటనే క్షేత్ర స్థాయి సిబ్బందికి తెలియజేయాలన్నారు. ప్రజారోగ్యమే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ పనిచేసి మెరుగైన వైద్య సేవలందించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ఎం.కౌశిక్, ఎఎంఒ సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు శ్రీనివాస్ రావు, కృష్ణంరాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


సిబ్బందికి సూచనలిస్తున్న జగన్మోహన్‌రావు

తెలుగు భాషకు వన్నెతెచ్చిన డాక్టర్ మూర్తి

ప్రజాశక్తి- సాలూరు

తెలుగు భాషకు వన్నె తెచ్చిన మహనీయుడు డాక్టర్ బిఎస్ఎన్ మూర్తి అని లయన్స్ క్లబ్ అధ్యక్షులు కర్రి వెంకట్రావు అన్నారు. సోమవారం పట్టణంలోని లయన్స్‌క్లబ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో నిర్వహించిన డాక్టర్ బిఎస్ఎన్ మూర్తి స్మారక సారస్వత నీరాజనం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. లయన్స్ క్లబ్, ధర్మశాస్త్రం మాసపత్రిక సంయుక్తంగా డాక్టర్ వి.గణేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మంచిపిల్లి శ్రీరాములు జ్యోతి ప్రజ్వలన చేశారు. కళాబంధు జర్జాపు ఈశ్వరరావు, లయన్ డాక్టర్ అరిశెట్టి మోహన్ రావులను డాక్టర్ బిఎస్ఎన్ మూర్తి అవార్డులతో సన్మానించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షులు కర్రి వెంకట్రావు మాట్లాడుతూ తెలుగు భాష వాడుకలో డాక్టర్ బిఎస్ఎన్ మూర్తి ది అందె వేసిన చేయి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఇటీవల గ్రూప -1 పరీక్షల్లో ఉత్తీర్ణులై అనకాపల్లి ఆర్‌డిఒగా నియమితులైన గోపిశెట్టి మనోహర్, ఎఎఒ కోట కుమారస్వామి, అథ్లెటిక్స్ క్రీడాకారిణి కనకల పైడిరాజులను సన్మానించారు. ప్రముఖ నాట్య కళాకారిణులు డి.లీలావతి, ఎ.అనుప్రియలను, డాక్టర్ బిఎస్ఎన్ మూర్తి ఎక్స్‌లెన్స్ అవార్డులతో సత్కరించారు. చిన్నారి లాస్య చేసిన నాట్యం అలరించింది. శ్రీకాకుళం పట్టణానికి చెందిన నాద బ్రహ్మ కె.గోవిందరావు ప్రదర్శించిన నాదస్వరం ఆహూతులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో సాలూరు సాహితీ మిత్ర బృందం వ్యవస్థాపక అధ్యక్షుడు జెబి తిరుమలాచార్యులు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత నారంశెట్టి ఉమామహేశ్వరరావు, అభ్యుదయ రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు చింత అప్పలనాయుడు మాట్లాడారు. ఈ సందర్భంగా గొర్లె సూర్యనారాయణ రాసిన భారతీయం నాడు నేడు కవితా సంకలనాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సాలూరు సాహితీ మిత్ర బృందం సభ్యులు శేషాద్రి సోమయాజులు, చందూ మాస్టర్, గొట్టాపు శ్రీనివాసరావు, ఆకుల గణపతి పాల్గొన్నారు.

కలెక్టర్‌ను ఆహ్వానించిన కిట్టు

ప్రజాశక్తి - పార్వతీపురం

ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం జిల్లా స్థాయి పోటీలకు కలెక్టర్ నిశాంత్ కుమార్ ను "కిట్టు" (మస్కట్) ఆహ్వానించింది. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్‌ను కలెక్టర్ కార్యాలయంలో ఆహ్వాన పత్రికను జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్.వెంకటేశ్వరరావుతో కలిసి అందించింది. జిల్లా స్థాయిలో జనవరి 31 నుండి ఫిబ్రవరి 5 వరకు ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు డిఎస్‌డిఒ తెలిపారు. జిల్లా అధికారులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని కిట్టును ప్రోత్సహించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఐటిడిఎ పిఒ సి.విష్ణుచరణ్, డిఆర్ఒ జె.వెంకటరావు, ఆర్‌డిఒ కె.హేమలత, కె ఆర్ ఆర్ సి ఎస్డిసి జి కేశవ నాయుడు, డిఇఒ ఎన్.ప్రేమకుమార్, గ్రామ, వార్డు సచివాలయాల నోడల్ అధికారి కె.రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.


కలెక్టర్‌ను ఆహ్వానిస్తున్న కిట్టు

భూములు ఆక్రమణకు గురికాకుండా చూడాలి

ప్రజాశక్తి - పాలకొండ

జగనన్న కాలనీ సామాజిక అవసరాల కోసం కేటాయించిన స్థలంతో పాటు ఎటువంటి ప్లాట్ నెంబర్లు కేటాయించకుండా ఉన్న స్థలం ఆక్రమాలకు గురికాకుండా రక్షించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు డిమాండ్ చేశారు. స్థానిక నగర పంచాయతీ పరిధిలో జగనన్న కాలనీ నిర్మాణం జరుగుతున్న ప్రాంతంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పరిశీలించిన సందర్భంగా విశాలమైన ఖాళీ స్థలం ఉందన్నారు. ఈ స్థలంలో ఇటీవల కాలంలో కొంతమంది కొలరాయిలు పాతి ఆక్రమణకు ప్రయత్నిస్తే అధికార యంత్రాంగం తొలగించిందన్నారు. అయితే అధికార యంత్రాంగం తొలగింపు తాత్కాలికమేనని, ఆ స్థలాన్ని అధికార పక్షం బినామీలకు పట్టాలిప్పించాలని ప్రయత్నిస్తుందని తెలిపారు. ప్లాట్ నెంబర్లతో కూడిన పట్టాలు ఎన్ని మంజూరు చేశారు? సామాజిక అవసరాలకు మిగతా ఖాళీగా ఉన్న స్థలాన్ని ప్రజా ప్రయోజనాల కింద ఉపయోగించేలా చర్యలు తీసుకోవాలని, శ్వేత పత్రం విడుదల చేసి ప్రజానీకానికి తెలియజేయాలని కోరారు. లేకుంటే కాలనీవాసుల్ని సమీకరించి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. పరిశీలనలో సిఐటియు మండల కార్యదర్శి కాద రాము, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు దూసి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.


భూములను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

కార్మిక సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- పార్వతిపురం టౌన్

మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం కార్మిక సమస్యలను పరిష్కరించాలని సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావును కోరారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయానికి వచ్చిన ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్పర్సన్‌లకు మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఇంజనీరింగ్ వర్కర్స్ సిఐటీయు జిల్లా గొర్లి వెంకటరమణలు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంజనీరింగ్ విభాగంలో అనేక కేటగిరిల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సమ్మె చేశారని, రాష్ట్ర ప్రభుత్వం కార్మికులతో చర్చలు జరిపి వారి సమస్యలు పరిష్కరిస్తామని, స్కిల్డ్ సెమిసిల్డ్ అధ్యయన కమిటి వేస్తామని, అందుకోసం జీఓలు విడుదల చేస్తామని, హామి ఇచ్చిందని, హామీలో భాగంగా సమ్మెవిరమించుకున్నామని అయినా నేటికి 15 రోజులు అవుతున్నా కార్యాచరణ జరగడం లేదని మీరు చొరవచూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీర్ విభాగం కార్మికుల అధ్యక్షులు తాడ్డి వినయ్, తాతబాబు, రమేష్, కృష్ణ, గోవింద పండా తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేకు వినతి పత్రాన్ని ఇస్తున్న నాయకులు

ముగిసిన 'ఆడుదాం ఆంధ్ర'

ప్రజాశక్తి - కురుపాం

మండల కేంద్రంలోని సాయిబాబా మైదానం వద్ద గత ఆరు రోజులుగా జరుగుతున్న నియోజకవర్గ స్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు సోమవారం ముగిశాయి. ఎంపిడిఒ ఎస్. అప్పారావు అధ్యక్షతన జరిగిన ముగింపు కార్యక్రమంలో ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

కబడ్డీ, కోకో, క్రికెట్, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలలో నియోజకవర్గంలో ఐదు మండలాల నుంచి 46 టీమ్‌లు పాల్గొని తలబడ్డాయి. వాలిబాల్ పురుషుల విభాగంలో వబ్బంగి, దుడ్డు ఖల్, పాలెం జట్లు వరుసుగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు కైవసం చేసుకున్నాయి. వాలీబాల్ మహిళల విభాగంలో జిటివాడ, పి.లేవిడి, దుడ్డు ఖల్ జట్లు, కబడ్డీ పురుషుల విభాగంలో మొండెం ఖల్, గుమ్మడ, చినగుడబ, మహిళల్లో పి.లేవిడి, తాడికొండ, కొండచిలకాం జట్లు, షటిల్ బ్యాడ్మింటన్‌లో కురుపాం, గుమ్మలక్ష్మి పురం, మహిళల్లో ఇరిడి, కురుపాం, పాలెం కొమరాడ, ఖో ఖోలో కొండవాడ, గునదతీలేసు, పాలెం కొమరాడ, మహిళల్లో జి.శివడ, చినమేరంగి, పి.ఆమిటి, క్రికెట్ పురుషుల్లో పి.లేవిడి, గరుగుబిల్లి, జియ్యమ్మవలస, మహిళల్లో జియ్యమ్మవలస జట్లు విజయం సాధించాయి. ఈ కార్యక్రమంలో ఎంపిపి శెట్టి పద్మావతి, జెడ్‌పిటిసి జి సుజాత, సర్పంచ్ జి. సుజాత, ఎంపిటిసిలు బంగారు నాయుడు, మండల కన్వీనర్ గౌరీశంకర్, నాయకులు శెట్టి నాగేశ్వరరావు, అంధవరపు కోటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు, పీడీలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'అర్జీదారులకు న్యాయం చేస్తాం'

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

స్పందన కార్యక్రమంలో భాగంగా ప్రతి సోమవారం అర్జీ దారి నుంచి వచ్చే ఫిర్యాదులపై విచారణ జరిపించి న్యాయం చేస్తామని పార్వతీపురం మన్యం జిల్లా అదనపు ఎస్‌పి డాక్టర్ దిలీప్ కుమార్ అన్నారు. సోమవారం ఎస్‌పి కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమాల్లో ఆయన పాల్గొని అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. నేరుగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుండి అర్జీలను స్వీకరించి, అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకొని, వారి సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించారు. సంబందిత పోలీసు అధికారులతో స్వయంగా ఫోన్లో మాట్లాడి బాధితులకు చట్ట పరిధిలో తక్షణ న్యాయం అందించేలా చర్యలు తీసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బి సిఐ సిహెచ్ లక్ష్మణ రావు, డిసిఆర్‌బి సిఐ సిహెచ్ వాసునాయుడు, డిసిఆర్‌బి ఎస్ఐ ఎస్‌కె. ఫక్రుద్దీన్, దిశా ఎస్ఐ ప్రయోగమూర్తి సిబ్బంది పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

గోముఖినదిలో మృతదేహం లభ్యం

ప్రజాశక్తి -మక్కువ

మండలంలోని శంబర గ్రామ సమీపాన గల వంతెన దిగువ భాగంలో గోముఖి నదిలో మృతదేహం లభ్యమైంది. నదిలో బోర్లు పడి ఉన్న మృతదేహాన్ని సోమవారం రాత్రి 7గంటల ప్రాంతంలో చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో స్థానిక ఎస్సై పి.నరసింహమూర్తి ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడు మండలంలోని పెద్దవలస గ్రామానికి చెందిన వద్దే సింహాచలం(సిమ్మ)గా గుర్తించారు. మృతదేహాన్ని సాలూరు సిహెచ్‌సికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసును దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

సారా వ్యాపారులపై బైండోవర్

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలో సారా రవాణా, విక్రయాలతో సంబంధం ఉన్న 34 మందిపై పట్టణ పోలీసులు బైండోవర్ కేసులు నమోదు చేశారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో సారా విక్రయాలు చేస్తున్న వారితో టౌన్ సిఐ జిడి బాబు ప్రమాణాలు చేయించారు. అనంతరం వారినుద్దేశించి మాట్లాడుతూ సారా తయారీ, రవాణా, విక్రయాలు చట్టవ్యతిరేక కార్యకలాపాలని చెప్పారు. ఇలాంటి కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు.

ఇసుక ట్రాక్టర్ బోల్తా


ప్రజాశక్తి - మక్కువ

అక్రమంగా ఇసుక తరలిస్తూ ట్రాక్టర్ బోల్తా పడిన ఘటన సోమవారం డి-శిర్లాం-కొత్తవలస రహదారి సమీపంలో చోటు చేసుకుంది. ఇసుక లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ మలుపు వద్ద బోల్తా పడింది. సంబంధిత ట్రాక్టర్ సీతానగరం మండలానికి చెందినదిగా గుర్తించారు. బోల్తా పడిన ట్రాక్టర్‌కు ఇసుక రవాణా అనుమతులు ఇవ్వలేదని శిర్లాం కార్యదర్శి దుర్గాప్రసాద్ తెలిపారు. కాగా ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు.

సంత నర్సిపురంలో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని సంత నర్సిపురం గ్రామంలో సోమవారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పి. ఉమామహేశ్వరి రోగులకు తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎం.ఎల్ హెచ్‌పి, ఏఎన్ఎం లక్ష్మి, ఆశ కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.


సీతానగరం: తనిఖీలు చేస్తున్న వైద్య సిబ్బంది

సీతానగరం: మండలంలోని లక్ష్మీపురం గ్రామ సచివాలయ పరిధి ఏగోటివలసలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పెదఅంకలాం వైద్యాధికారి ఎం.రాధాకాంత్ మాట్లాడుతూ దీర్ఘకాలిక వ్యాధులైన బిపి, షుగర్ ఇతర వ్యాధులకు ఈ కార్యక్రమంలో సేవలందిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎఎన్ఎం బి.రమాదేవి, సిహెచ్ఒ కె.హరిప్రియ, హెల్త్ అసిస్టెంట్ వెంకటేష్, 104 సిబ్బంది, ఆశా కార్యకర్త రోగులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ చట్టం అమలుపై శిక్షణ

ప్రజాశక్తి - కురుపాం

ఆదివాసీ యువతకు ఉపాధి హామీ చట్టంపై పూర్తిగా అవగాహన ఉండాలని లిబ్ టెక్ ఇండియా ప్రతినిధులు కిషోర్, వెంకటేష్ అన్నారు. సోమవారం స్థానిక ఎస్ సొసైటీ కార్యాలయంలో కార్యదర్శి షేక్ గౌస్ ఆధ్వర్యంలో ఆదివాసీ యువతీ యువకులకు ఉపాధి హామీ చట్టం అమలుపై నిర్వహించిన శిక్షణా కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు యువతకు ఉపాధి హామీ చట్టం అమలు, సాంకేతిక పరమైన అంశాలపై ప్రధానంగా జన్ మన్ రేగ యాప్, ఎన్ఎంఎంఎస్, యాప్‌లు చేసిన పనికి వచ్చిన వారి వేతనాల వివరాలు వెబ్సైట్‌లో పరిశీలనపై అవగాహన, ఆధార్ లింక్‌కు సంబంధించిన అంశాలు ఎన్‌పిసిఐ, పేమెంట్ సిస్టమ్, జాబ్ కార్డ్ తొలగించబడిందా లేక ప్రస్తుతం యాక్టివ్‌గా ఉందా తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఇవన్నీ మనం తెలుసుకున్నట్లయితే ఉపాధి హామీ కార్యాలయానికి వెళ్లకుండా మనమే తెలుసుకోవచ్చున్నారు. కావున ఈ శిక్షణలో నేర్చుకున్నవన్నీ యువత సభ్యులకు అవగాహన కలిపంచాలని సూచించారు. కార్యక్రమంలో ఆదివాసీ యువత పాల్గొన్నారు.